విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 25, ఆగస్టు 2024

తొలగిన విద్యుత్తు తీగల సమస్య

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని అగ్రహారం వీధిలో ఉన్న గుడిపాటి రామకృష్ణ ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను విద్యుత్ అధికారులు శనివారం తొలగించారు. ఈనెల 22వ తేదీన 'సారూ.. కరెంటు తీగలను తొలగించరూ'. అనే శీర్షిక న విశాలాంధ్రలో ప్రచురితమైన వార్తకు స్పందించిన విద్యుత్ ఏఈ పకీరయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించారు. గుడిపాటి రామకృష్ణ ఇంటికి ఎదురుగా నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి కరెంటు తీగలను ఆ స్తంభం మీదుగా మరలించారు. ఈ సందర్భంగా గుడిపాటి రామకృష్ణ మాట్లాడుతూ తన ఇంటి వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని విద్యుత్ అధికారులు తొలగించడంతో కరెంటు తీగల సమస్య తొలగిపోయిందని అన్నారు. కేవలం రెండు రోజుల్లోనే విద్యుత్ అధికారులు సమస్యను తొలగించినందుకు సంతోషంగా ఉందని అన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించేందుకు సహకరించిన విశాలాంధ్రకు, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు

విశాలాంధ్ర-శిరివెళ్ల : మండల పరిధిలోని కామినేని పల్లిలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినట్లు సర్పంచు చిన్న నరసింహారెడ్డి తెలిపారు. గ్రామంలోని కొన్ని వీధులలో పాత విద్యుత్ స్తంభాలకున్న విద్యుత్ తీగలు అతి తక్కువ ఎత్తులో ఉండడంతో వాటి స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేసి నూతన విద్యుత్ కేబుల్ సౌకర్యం కల్పించి ఎల్ఈడి విద్యుత్ బల్బులు అమర్చినట్లు సర్పంచు పేర్కొన్నారు. గ్రామంలో అనేక సంవత్సరాల క్రిందట పాత విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయగా అవి కాలక్రమేనా శిధిలావస్థకు చేరడం వీధులు సీసీ రోడ్లుగా మారడం మరియు వీధుల పక్కన నివాసాలు ఎత్తుగా ఉండడం వల్ల విద్యుత్తు లైన్ల నుండి ప్రమాదం పొంచి ఉన్నదని భావించి ముందు జాగ్రత్త చర్యగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతన విద్యుత్తులైన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మౌలిక వసతుల కల్పనలో కామినేని పల్లె గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు తనావంతు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ మెరువ చిన్న నరసింహారెడ్డి పేర్కొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: వసతి గృహాల్లో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో ఉమా మహేశ్వర రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలు ఆయన సందర్శించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, బండ పరుపు, అదనపు గదులు, వరండా, కిటికీలకు దోమలు రాకుండా నెట్లు, మురికి నీరు బయటికి వెళ్లేందుకు పైపులైను సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఈయన వెంట ఎంఈఓ వీర ప్రతాప్ రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సంక్షేమ గృహ అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర-రుద్రవరం: ప్రభుత్వ పాఠశాలల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల చిత్రాలను తీయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని మండలంలోని వెల్ఫేర్ , ఎడ్యుకేషనల్ సచివాలయ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలో మరుగుదొడ్ల చిత్రాలు అప్లోడ్ చేసే విధానాన్ని తమకు అప్పగించడం న్యాయం కాదని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మెమోను వెనక్కి తీసుకునేలా అధికారులు చొరవ చూపాలని తహసిల్దార్ మల్లికార్జునరావుకు మండలంలోని వెల్ఫేర్ ఎస్టేట్లు ఝాన్సీ రాణి,వినోద్ ,ఫ్రేమ్ జాషువా,శశిరేఖ ,ఆంజనేయులు,రుక్సానా బేగంతో పాటు పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మాత్రమే మరుగుదొడ్ల చిత్రాలను హెచ్ఎం లాగిన్ లో అప్లోడ్ చేసేవారని ప్రస్తుతం ప్రభుత్వం ఆ విధానాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగిస్తూ వారంలో సోమవారం గురువారం చేయాలని మెమో ఉత్తర్వులు జారీ చేయడం సరైనది కాదని తెలిపారు. ప్రభుత్వం తన సమస్యలను గుర్తించి మరుగుదొడ్ల చిత్రాలు తీసే అంశాన్ని పాత పద్ధతినే కొనసాగిస్తూ ఉపాధ్యాయులకే అప్పగించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి నాయక్ మస్తాన్వలి పార్థసారధి రెడ్డి శివప్రసాద్ తోపాటు పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-రుద్రవరం: పాఠశాలల నిర్వహణ సక్రమంగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు పాఠశాల కమిటీ చైర్మన్లు కృషి చేయాలని ఎంఈఓ లు కోటయ్య లక్ష్మిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ సమావేశ భవనంలో దూర విద్యా విధానం పాఠశాలల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక విద్యా విధానంపై పాటించాల్సిన అంశాలపై ప్రధానోపాధ్యాయులకు సూచించడం జరిగిందన్నారు. పది, ఇంటర్, దూరవిద్య చదవాలనుకున్న విద్యార్థులు డిస్టెన్స్ పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పాఠశాలలో టాయిలెట్ల నిర్వహణపై ప్రతివారంలో బుధ, శుక్రవారం పాఠశాల కమిటీ మెంబర్లు, సోమ, గురువారం వెల్ఫేర్ అసిస్టెంట్లు ఫోటోలు తీసి పాఠశాలకు చెందిన యాప్‌లో అప్లోడ్ చేయాల్సి ఉందని తెలిపారు.మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మౌలిక వసతులు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించామని తెలిపారు. ఈసమావేశంలో ఈవోపీఆర్డి శ్రీనివాస శర్మ ఆయా పాఠశాలల హెచ్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాల కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

బడిమానేసిన వారికి ఓపెన్ స్కూల్ సదవకాశం

విశాలాంధ్ర-గడివేముల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్‌లు, విద్యాసంక్షేమ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ విద్యాసాగర్ మాట్లాడుతూ, ఓపెన్ స్కూల్ (సార్వత్రిక విద్యాపీఠం) ద్వారా చదువును మధ్యలో మానేసిన వారి కోసం పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులను ఇంటి వద్దనే చదువుకుంటూ పరీక్షకు హాజరై పూర్తి చేసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం ఎంఈవోలు మేరీ సునీత, విమల వసుందరదేవిలు మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్లు అన్ని రకాలైన ఉద్యోగ అవకాశాలకు, ఉన్నత చదువులకు ఉపయోగించుకోవచ్చని సూచించారు. పాఠశాలల యొక్క టాయిలెట్లకు సంబంధించి, పరిశుభ్రత వివరాలను ఇప్పట్నుండి పాఠశాల ఎస్ఎంసి కమిటీ, విద్యా సంక్షేమ సహాయకులు ఆన్లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశం అనంతరం ఓపెన్ స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గడివేములలో ర్యాలీ నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలి



విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: గ్రామాల అభివృద్ధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు భాగ స్వామ్యం కావాలని ఎంపీపీ రాఘవేంద్ర రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన, ఎంపీడీవో మహబూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఎంపీడీవో మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉంటే సమావేశము దృష్టికి తీసుకుని రావాలన్నారు. తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి రెవిన్యూ అంశాలపై వివరించారు.ఉపాధి హామీ పథకం, విద్య, పంచాయతీరాజ్, తాగునీరు, వ్యవసాయం అంశాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు వివరించారు.

అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా పెంచాలి జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక పంపిణీ ప్రక్రియలో భాగంగా అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి నియంత్రణలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత ఇసుక విధాన పటిష్ట అమలుపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌తో కలిసి జిల్లాస్థాయి స్టాండింగ్ కమిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో గనుల శాఖ ఏడి రామచంద్ర, నంద్యాల ఆర్డిఓ మల్లికార్జున రెడ్డి, డిటిసి శివారెడ్డి, కేసీ కెనాల్ ఈఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోందని, నంద్యాల జిల్లాలో ఇసుక నిల్వలు, స్టాక్ పాయింట్ లు లేని కారణంగా సమీప జిల్లాలైన కర్నూలు జిల్లాలోని సి.బెళగల్ మండలంలోని సుంకేసుల బ్యారేజీ, కడప జిల్లాలోని కొండాపురంలలో నిల్వ ఉన్న స్టాక్ పాయింట్‌ల నుండి లోడింగ్, రవాణా చార్జీలతో వినియోగదారులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. స్టాక్ పాయింట్‌ల నుండి ఇసుక రవాణా చేసుకునేందుకు 123 (ఆరు టైర్లు, 10 టైర్లు) వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, రవాణా చార్జీల భారాన్ని నెగోషియేట్ చేసి తగ్గించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రవాణా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉచిత ఇసుక సరఫరా సంబందిత అంశాలకు సంబంధించి కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెం. 08514 242011 నెంబర్‌కు కాల్ చేసి సమాచారాన్ని స్వీకరించవచ్చన్నారు. జిల్లాలో కొలిమిగుండ్ల, బేతంచర్ల, డోన్ చెక్ పోస్ట్‌లతో పాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చాగలమర్రి, బ్రాహ్మణకొట్కూరులలో చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేశామని, అక్రమ ఇసుక రవాణాపై 24 గంటల పాటు నిరంతరాయంగా ప్రత్యేక నిఘా ఉంచి నియంత్రణలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్కొక్క నిఘా బృందంలో 13 మంది అధికారులు పనిచేస్తున్నారన్నారు. ఉచిత ఇసుక విధానంపై కమిటీ సభ్యులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేయడంతో పాటు ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో కూడా స్టాక్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. స్టాక్ పాయింట్లు వద్ద వినియోగదారుడు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్లతో వెళ్లి ఇసుక త్రవ్వటానికి, లోడింగ్ కు ప్రతి మెట్రిక్ టన్నుకు రు. 335/- ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి వినియోగదారునికి 20 మెట్రిక్ టన్నుల వరకు ఇసుక తీసుకోవచ్చన్నారు. డిజిఎం పోర్టల్ లో లాగిన్ అయితే స్టాక్ పాయింట్ లలో ఉన్న ఇసుక నిలువల వివరాలు తెలుస్తాయన్నారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ మాట్లాడుతూ చాగలమర్రి, బ్రాహ్మణకొట్కూర్, కొలిమిగుండ్లలో ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్సీ మనోహర్, డిపిఓ మంజులవాణి, గ్రౌండ్ వాటర్ డిడి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-బనగానపల్లె : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడులు మర్యాద పూర్వకంగా కలిశారు.బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్ ద్వారా జిల్లా లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో పని చేస్తున్న యోగ ఉపాధ్యాయులు బిసి జనార్ధన్‌రెడ్డిని కలిసి 18 నెలలుగా జీతాలు రాని విషయాన్ని మంత్రి దృష్టికి యోగ ఉపాధ్యాయులు,సీపీఐ నాయకులు తీసుకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జనార్ధన్‌రెడ్డి వారికి తగు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

ఈకార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు, ఏటిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ బాలకృష్ణ, మండల కార్యదర్శి సుబ్బారెడ్డి,నంద్యాల జిల్లాలోని యోగ ఉపాధ్యాయులు, యోగ టీచర్స్ సమాఖ్య రాష్ట్ర ప్రెసిడెంట్ యన్నా వెంకటయ్య,సుబ్బారావు, రామకృష్ణా రెడ్డి మరియు యోగ టీచర్స్ యొక్క తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహానంది దేవస్థానానికి చెందిన ప్లాట్లు స్వాధీనం

విశాలాంధ్ర-నంద్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది దేవస్థానానికి సంబంధించిన స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించుకోగా శనివారం కోర్టు ఉత్తర్వుల మేరకు ఆప్లాట్లలో నిర్మాణాలు కూలగొట్టి రెవిన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో స్వాదినం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి మహానంది దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని స్టేట్ బ్యాంకు కాలనీలో శ్రీ మహానందీశ్వర స్వామి వారి దేవస్థానం హక్కు భుక్తము సంబంధించిన దేవస్థానం నౌకరి (ఇనాము) భూమి సర్వే నెంబరు 2247 లో 3.78 ఎకరాలకు గాను 2.08 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకొని ప్లాట్లు వేశారని, సదరు భూమి ఆక్రమణదారుల నుండి దేవస్థానం స్వాధీన పరుచుకొని విషయమై ఎండోమెంట్ ట్రిబ్యునల్, పెద్దకాకాని, గుంటూరు నందు 27 మందిపై కేసులు వేయగా ముగ్గురి నుండి ప్రస్తుతం 3 ప్లాట్లు స్వాధీనం చేసుకొనుటకు ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టు అనుకూలమైన తీర్పు ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టు తీర్పు మేరకు శనివారం జిల్లా దేవదాయ శాఖాధికారి, మహానంది దేవస్థానం అధికారి, రెవిన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో స్వాధీన పరుచున్నట్లు ఆయన తెలిపారు. మిగిలిన ప్లాట్లను కూడా కోర్టు ఉత్తర్వులు వచ్చిన వెంటనే స్వాధీనం చేసుకుంటామని ఇఓ తెలిపారు. టూ టౌన్ సిఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఐటీడీపీ కన్వీనర్ ఇంతియాజ్ కు ప్రశంసా పత్రం

విశాలాంధ్ర-మిడుతూరు: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు గత ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలు బయటపెట్టి, బాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను సోషల్ మీడియా ద్వారావిస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషిచేసిన టీడీపీ సోషల్ మీడియా లోని ఐటిడిపి కన్వీనర్‌లను ఆపార్టీ రాష్ట్ర జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ వారిని గుర్తించి వారికి ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలు అందజేస్తున్నారు. అందులో భాగంగానే నందికొట్కూరు నియోజక వర్గ పరిధిలోని మండల కేంద్రమైన మిడుతూరుకు చెందిన ఐటీడీపీ కన్వీనర్ ఇంతియాజ్ భాషాకు విద్యాశాఖ,ఐటీ, మంత్రి లోకేశ్ చే ప్రశంసా పత్రం అందుకున్నారు .తెలుగుదేశం పార్టీలో బెస్ట్ ఫర్ఫార్మర్ గా ఎన్నిక కావడం పట్ల పార్టీ అధినేతకు ప్రత్యేక అభినందనలు తెలిపాడు .యువగళం పాదయాత్ర మొదలు గత సార్వత్రిక ఎన్నికలల్లో కూటమి అద్భుత విజయం సాధించే వరకు కృషి చేశామని అనేక రకాలుగా పార్టీకి అండగా ఉంటూ సహనం కోల్పోకుండా పార్టీ కార్యకర్తలను తెలుగుదేశం సైనికులుగా చేసినందుకు మండల టిడిపి కన్వీనర్ కాతారమేష్ రెడ్డి స్ఫూర్తితోనే మండలంలోని పలు గ్రామాల్లో యువత రాజకీయాల్లో చురుకైన పాత్రను పోషిస్తూ టిడిపి యాప్ ను ప్రజల్లోకి తీసుకొని వచ్చి జగన్ సోషల్ మీడియాని తిప్పి కొట్టడం, అబద్ధపు ప్రచారాలు ప్రజలకు వాస్తవాలను తెలియ జేయడంలో ఇంతియాజ్ కృషినీ నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇంచార్జ్ మాండ్రా శివానందరెడ్డి తో పాటు ఆయన సతీమణి మాండ్రా ఉమాదేవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జూపాడు బంగ్లా మండల టిడిపి కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు ,సత్యం రెడ్డి ,డీలర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో సత్తా చాటిన విద్యార్థులు

విశాలాంధ్ర-వెలుగోడు : మండల కేంద్రమైన వెలుగోడులోని వంశీధర నర్సింగ్ హోమ్ యాజమాన్యం డా.శివరామిరెడ్డి, డా.పద్మ దంపతుల కుమారుడు సి.నాగశశి ప్రణయ్‌రెడ్డి నీట్ పీజీలో 1272 ఆలిండియా ర్యాంకుతో సత్తా చాటాడు. ఈ విద్యార్థి పదవ తరగతిలో 10 కి10 మార్కులు సాధించి, ఇంటర్మీడియట్ గుంటూరు గురుస్ కళాశాలలో చదివి రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించాడు.నీట్‌లో 1440 ఆల్ ఇండియా ర్యాంకు సాధించి ఛత్తీస్గఢ్ ఎయిమ్స్ లో చేరి ఎంబిబిఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం వెలువడిన నీట్ పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లోనూ 1272ఆలిండియా ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. వెలుగోడుకి చెందిన శ్రీనివాసులు కుమారుడు రాజకుమార్ నీట్ పీజీలో 8200 ఆలిండియా ర్యాంకుతో ప్రతిభ చాటాడు. ఈవిద్యార్థి వెలుగోడు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో9.7 పాయింట్లు సాధించి ఇంటర్మీడియట్లో 982 మార్కులు సాధించాడు. నీట్ లో 548 మార్కులతో 7872 ఆలిండియా ర్యాంకు సాధించి కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేశాడు.ప్రస్తుతం వెలువడిన నీట్ పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో 8200 ఆలిండియా ర్యాంకు సాధించాడు. నీట్ పీజీలో ప్రతిభ చాటిన నాగశశిప్రణయ్‌రెడ్డిని,రాజ కుమార్‌లను ఆర్ఎంపీలు, బంధుమిత్రులు, పట్టణ ప్రజలు, అభినందనలు తెలిపారు.

గడివేముల : ట్రిపుల్ ఐటీకి ఆదర్శ పాఠశాల



విద్యార్థిని ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఆదర్శ పాఠశాల విద్యార్థిని వర్షిత మండలస్థాయిలో పదిలో మొదటి స్థానంలో 564 మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచి ఐఐఐటికి ఎంపిక అయిందని ప్రిన్సిపాల్‌శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వర్షిత శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందన్నారు. ట్రీబుల్ ఐటీలో సీటు సాధించిన వర్షతను ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, తోటి స్నేహితులు అభినదించారు.



విశాలాంధ్ర-రుద్రవరం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని పి.జశ్విత మండల స్థాయిలో పదిలోమొదటి స్థానం 576 మార్కులతో మంచి ఉత్తీర్ణత సాధించి, ఐఐటికి ఎంపిక కావడం జరిగిందని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపినారు. శనివారం ఆయన వివరాల మేరకు గత ఏడాది తులసి, ప్రస్తుత జేశ్విత కడప లోని ఇదుపులపాయ లో తులసీ ఒంగోలు ట్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించారని తెలిపారు.ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, పాఠశాలకమిటీ సభ్యులు , స్నేహితులు అభినందించారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం- మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: వైసీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, తాలూకా వైసీపీ నాయకులు భూమా కిషోర్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎస్.లింగందిన్నెకు వెళ్లి వైసీపీ కార్యకర్త చాకలి శ్రీనుకు పార్టీ అందించిన లక్ష రూపాయల చెక్కును అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ఇరువురు నాయకులు భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీతారామపురం గ్రామానికి వచ్చిన సందర్భంగా చాకలి శ్రీను కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారని అందులో భాగంగా లక్ష రూపాయల చెక్కును ఆ కుటుంబానికి అందజేయడం జరిగిందన్నారు. చాకలి శీనుపై హత్యాయత్నం కేసులో ముద్దాయిలను ఇంకా అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా పట్టం కడితే ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వకపోగా చిల్లర కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. రెండు నెలల్లోనే ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్నారన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక సూపర్ వన్ పథకం కూడా అమలు చేయలేదన్నారు. తల్లికి వందనానికి పంగనామాలు పెట్టారని, అన్నా క్యాంటీన్లు ఒకటి రెండు చోట్ల మొక్కుబడిగా ప్రారంభించారని, మహిళలకు ఉచిత బస్సుకు మంగళం పాడారని ఎద్దేవా చేశారు. తాలూకా వైసీపీ నాయకులు భూమా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ తమ కార్యకర్త చాకలి శ్రీనుకు పార్టీ తరపున లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందని వారికుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. ఆళ్లగడ్డలో అరాచకాలు ఎక్కువ అయ్యాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. శిల్పకళా కేంద్రాలు, చికెన్ సెంటర్లు వారి వద్ద నుండి మామూలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బాడుగకు వాహనాలు పెట్టుకున్న వారిని కూడా మామూల్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఆళ్లగడ్డలో ఇసుక ట్రాక్టర్ రూ.15 వేలు అమ్ముతున్నారన్నారు. మిత్రపక్షంలోని జనసేన నాయకులు ఇవన్నీ చూస్తూ నిద్రపోతున్నారా అని ఆయన ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో శాంతి భద్రతలను కాపాల్సిన బాధ్యత పోలీసులదేనని వారు అందరికీ సమన్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, అంబటి మహేశ్వర్ రెడ్డి, భూమా వీరభద్రారెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వ నరసింహస్వామి సన్నిధిలో ఏపీ ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రెటరీ

విశాలాంధ్ర-శిరివెళ్ల : శ్రీ సర్వ నరసింహ స్వామి ఆలయాన్ని ఏపీ ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవి సాయిప్రసాద్ శనివారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. మహదేవపురం సర్పంచు పెద్ది రమణయ్య, కార్యదర్శి కుమార్, ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.ఆయన కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది అర్చకులు వారికి కుటుంబ సభ్యులను పట్టు శాలువలు కప్పి పూలమాలలతో సన్మానం చేశారు.

యాగంటీశ్వరుడి సన్నిధిలో..

బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వర స్వామిని స్టేట్ ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రెటరీ వెంకటసాయిప్రసాద్ కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చేరుకోగానే అర్చకులు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.

ఆళ్లగడ్డ : అహెూబిల లక్ష్మీ నరసింహ స్వామిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ కార్యదర్శి జి.వి.సాయి ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహెూబిలంలో ఆళ్లగడ్డ తహసీల్దార్ వి.జ్యోతి రత్నకుమారి,ఎలక్షన్ డిప్యూటీ తహశిల్దార్ జి.చంద్రశేకరయ్య తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జాయింట్ కార్యదర్శి కుటుంబ సభ్యులతో ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రహ్లాద వరద స్వామికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

అర్జీలు స్వీకరించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర-బనగానపల్లె: ప్రజల నుండి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వారి కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు.శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా అర్జీలు స్వీకరించిన మంత్రి కొన్నిటిని అక్కడికక్కడే పరిష్కరించగా కొన్నిటిని అధికారులకు పంపించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : ఇటిక్యాల గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఇరువురు శనివారం తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన నరసింహయ్య, బాలరాజులు ఇరువురు ద్విచక్ర వాహనంపై కొలిమిగుండ్ల వెళ్తుండగా గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడ్డారు.ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్ : బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని ఏపీపీ రాజేంద్రప్రసాద్, బార్ అసోసియేషన్ నాయకులు గోవిందరెడ్డి, గిరిరాజు, సుధాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నరసింహులు, సుదర్శన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్టు గదులు, ఆవరణంను పరిశీలించారు. కోర్టు అభివృద్ధి కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వెంకట్రామిరెడ్డి బాధ్యతలు

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా వెంకట్రామిరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన రమేష్‌బాబు నుండి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వెంకట్రామిరెడ్డి కృష్ణాజిల్లా ముమ్మిడివరం నుండి ఆళ్లగడ్డ కమిషనర్‌గా రావడం జరిగింది. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గతంలో తనకు ఆళ్లగడ్డలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య సమస్యలు, వీధిలైట్ల సమస్యలు ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే ప్రజలు తన దృష్టికి తేవాలని ఆయన సూచించారు. తమ సిబ్బంది సహాయంతో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆళ్లగడ్డ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను ఆమె నివాసంలో మర్యాదపూర్వంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉత్పత్తి పెంచేందుకే తయారు కేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-పాణ్యం : తెలుగు రాష్ట్రాల వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉండేం దుకే పిడిలైట్ రాఫ్ నూతన తయా రీ కేంద్రాన్ని జడ్చర్లలో ప్రారంభించడం జరిగిందని తెలపడానికి తమకెంతో గర్వంగా ఉందని పిడి లైట్ రాఫ్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ పూరి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిలైట్ పరిశ్రమ నుండి పేరెన్నిక గల టైల్స్ ఎడ్హెసివ్ ఉత్పత్తి మరింత పెరుగ నుందని స్పష్టం చేశారు. త ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఈశాన్య కర్ణాటక మార్కెట్లో అత్యంత నాణ్యత ప్రమాణాలు కలి గిన టైల్ ఎడ్హెసివ్ ఉత్పత్తుల డిమాండు తీర్చేందుకు ఎంతగానో దోహద పడుతుందని ఆయన తెలి పారు. వినియోగదారుల డిమాండ్ కు అనుగుణంగా ప్రీమియం ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను తాము అందిపుచ్చుకోనున్నామని భరత్ పూరి ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా ఈ తయారీ కేంద్రం.. పిడిలైట్ దీర్ఘకాలిక వృద్ధి వ్యూహానికి అనుగుణంగా భవిష్యత్తు విస్తరణకు విస్తృత అవ కాశాలు అందిస్తుందని భరత్ పూరి స్పష్టం చేశారు.పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా 80 శాతం సౌరశక్తితో నడుస్తుందని, నిర్మాణ రసాయనాల రంగంలో పర్యావరణ అనుకూల తయారీకి ప్రమాణాలు ఏర్పరుస్తుందని భరత్ పూరి వెల్లడించారు.

సీనియర్ నాయకుడి మృతికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణానికి చెందిన 20వ వార్డు టిడిపి కౌన్సిలర్ షేక్ హుస్సేన్ భాష తండ్రి , సీనియర్ టిడిపి నాయకులు, ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకుడు కోత మిషన్ షరీఫ్ (75) గుండెపోటుతో శనివారం మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అక్కడికి చేరుకొని షరీఫ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే అఖిల ప్రియ కౌన్సిలర్ హుస్సేన్ భాషను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. హుస్సేన్ భాష తండ్రి షరీఫ్ మరణం టిడిపి పార్టీకి తీరని లోటు అన్నారు. టిడిపి పార్టీ, భూమా కుటుంబం షరీఫ్ కుటుంబానికి ఎల్లవేళలా తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 25, ఆగస్టు 2024

తాగు నీరు రోడ్లు డ్రైనేజీ సమస్య పరిష్కరించండి-సీపీఐ..ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: గార్లదిన్నెలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐమండల సహాయ కార్యదర్శి రాజీవ్, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడులు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా గార్లదిన్నెలో సరైన రోడ్లు డ్రైనేజీ ప్రధానంగా తాగునీరు సమస్యగా మారిందని పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ కనీసం కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలకు ప్రాధాన్యతమిస్తూ అభివృద్ధి మరిచిందని ఆ ఫలితమే నేడు ప్రభుత్వాన్ని కోల్పోయిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులు సద్వినియోగం చేసి గ్రామంలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా సమస్యలతో కొట్టుమిట్టాలాడుతున్నాయన్నారు. ఇప్పటికైనా గ్రామ సమస్యలు పరిష్కరించాలి లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

విద్యార్థిని ఆత్మహత్య ప్రయత్నంపై సమగ్ర విచారణ జరిపించండి-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా సెలవు దినాల్లో కళాశాలలు నడుపుతూ వేలకు వేల ఫీజులు వసూలు చేస్తున్న సెయింట్ జోసెఫ్ కళాశాలలు ఫీజులపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఆర్ఐవో కార్యాలయ ఏవోకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న మాట్లాడుతూ రోజు రోజుకు విద్యార్థుల ఆత్మహత్య ప్రయత్నాలు అధికమవవడం బాధాకరమన్నారు. వీటన్నింటిని పట్టించుకోకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు కళాశాల యాజమాన్యాలకే వత్తాసు పలుకడం దారుణమన్నారు. నగరం లోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన కాశపోగు కీర్తి అనే విద్యార్థిని నాలుగో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య ప్రయత్నం చేసిందన్నారు. ఈ ఆత్మహత్య ప్రయత్నంపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినిని హాస్పిటల్‌కి తీసుకుపోయి వైద్య సేవలు ప్రారంభం కాకముందుకే కళాశాల యాజమాన్యం కరస్పాండెంట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థిని దగ్గర కాపీలు దొరకాయి మందలించాము అందుకే పైనుంచి దూకి ఆత్మహత్య ప్రయత్నం చేసిందని కానీ చిన్న రక్తం చుక్క కూడా లేదని ఏమీ కాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాపీలు దొరికితే ఆత్మహత్య చేసుకునే పరిస్థితుల్లో ఇవేం పబ్లిక్ పరీక్షలు కాదన్నారు. కళాశాలలో విద్యార్థులపై జరుగుతున్న ఒత్తిడి వల్ల విద్యార్థులు ఆత్మహత్యలకు కారణం అవుతున్నాయన్నారు. ముందుగా ఈ ఆత్మహత్య యత్నం మీద విచారణ జరిపించి విలేకరుల సమావేశంలో విద్యార్థినిపైకి నిందలు వేసిన కరస్పాండెంట్ మీద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి ఈవిషయాన్ని తీసుకువెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్ నగర నాయకులు అభి,వర్ధన్,అర్జున్,తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద నీరు

జల విద్యుత్ కేంద్రాలలో కొనసాగుతోన్న విద్యుత్ ఉత్పత్తి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ఎగువన కృష్ణా పరీవాహ ప్రాంతంలో వర్షాల కారణంగా శ్రీశైలం ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుతుంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి భారీగా వరద వస్తుండగా. అంతేస్థాయిలో శ్రీశైలానికి వదులుతున్నారు. రెండు వైపులా జలవిద్యుత్తు ఉత్పాదనతో శ్రీశైలం నుంచి 69,132 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు వదిలేస్తున్నారు. శ్రీశైలం జలాశయం ఘాట్‌రోడ్డులో ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడిన సంగతి తెలిసిందే. శ్రీశైలం జలాశయానికి 1,37,849 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. ఔట్ ఫ్లో 69,132 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.20 అడుగుల మేర నీటిమట్టం ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ 215.8070 టీఎంసీలుగా.. ప్రస్తుతం 210.9946 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. వరద ఇలాగే కొనసాగితే శ్రీశైలం జలాశయ గేట్లు మరోసారి ఎత్తే అవకాశం ఉంది.

ఫిర్యాదులపై అలసత్వం వహించొద్దు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: నగరపాలక హెల్ప్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను సంబంధించిత విభాగాలకు పంపించడంతో అలసత్వం వహించొద్దని నగర పాలక కార్యాలయ మేనేజర్ ఎన్.చిన్నరాముడు సూచించారు. నగరపాలక కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగాన్ని శనివారం మేనేజర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గత మూడు నెలలుగా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ హలో కేఎంసి కార్యక్రమానికి నగరపాలక సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వచ్చిన ప్రతి ఫిర్యాదుకు పారదర్శకంగా, జవాబుదారీతనం పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

విద్యార్థిని పరామర్శించిన ఆర్ఐవో



విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : నగరంలోని సుంకేసుల రోడ్డులో గల సెయింట్ జోసెఫ్ కళాశాలలో మొదటి సంవత్సరం బైపీసీ గ్రూప్‌కు చెందిన కాశపోగు కీర్తి ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలిక దగ్గరికి ఆర్ఐవో గురువయ్య శెట్టి వెళ్లి స్వయంగా పరామర్శించారు. అక్కడున్న డాక్టర్లతో ఆర్ఐవో మాట్లాడిన సంఘటన వివరించారు. విద్యార్థినికి ఆపరేషన్ చేయాలని ఆపరేషన్ చేసిన తర్వాత ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలున్నాయని డాక్టర్లు సూచించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు.

డీఎస్పీగా వెంకటరామయ్య బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-పత్తికొండ: పత్తికొండ డివిజన్ నూతన డీఎస్పీగా శనివారం బి.వెంకట రామయ్య బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న వెంకటరామయ్యను డీఎస్పీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సుమోటో కులధ్రువీకరణపై క్షేత్రస్థాయిలో అధికారులు..

విశాలాంధ్ర-పెద్దకడబూరు : సుమోటో కుల ధ్రువీకరణపై క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతిఇంటిని దర్శించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హనుమపురంలో సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్‌పై క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్ పాల్గొని గ్రామంలోని ఇంటింటిని సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలోని అధికారులు పూర్తిస్థాయి విచారణ చేసి నివేదికలో పంపాలన్నారు. ఒకవేళ ఏదైనా సమస్య ఉంటే వాటిపై విచారణచేసి రిపోర్టుని ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. ప్రతి ఒక్క అధికారి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి విచారణ చేసి నివేదికలు అందజేయాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఇంచార్జీ సబ్ కలెక్టర్ విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీనాథ్, డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐ మహేష్, ఆయా గ్రామాల వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

హనుమాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శనివారం మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శశిరేఖ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్యకు గ్రామ టిడిపి నాయకులు బి. పి.ఈరన్న, రాజశేఖర్, పెద్దయ్య వినతిపత్రం అందజేశారు. తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తాగునీటి సమస్యను పరిష్కరించడంలో సర్పంచ్ విఫలం చెందారని, గ్రామంలో పారిశుధ్య పనులు కూడా పట్టించుకోవడం లేదని జాయింట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గ్రామంలో సమ్మర్ స్టోరేజ్‌ట్యాంకు ఏర్పాటు చేసి గ్రామ సమీపంలోని ఎల్లెల్సీ కాలువ ద్వారా నీటిని నింపి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామంలో 50 ఏళ్లకు పైబడి నివాసముంటున్న ప్రజల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిందని పాఠశాల కొరకు స్థలాన్ని కేటాయించాలని, అంగన్వాడీ కేంద్రాల కోసం స్థలం, బిల్డింగ్ మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయులు సత్యకరుణ, అంగన్వాడీ కార్యకర్తలు జాయింట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, ఓబులేశు, యువనాయకులు లోకదాస్, గోవిందు, వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విద్యార్థులు ప్రతినిత్యం క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం యోగసాధన చేస్తే మంత్రి ఆరోగ్యం సిద్ధిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆవరణలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని యోగ, హాకీ, బాస్కెట్ బాల్,ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్,సెపక్తక్రా క్రీడా పోటీలను జాతీయ యోగ సంఘం కార్యవర్గ సభ్యుడు శ్రీధర్ రెడ్డి,డిఎస్డిఓ భూపతిరావు,జిల్లా యువజన శాఖ సీఈఓ రమణ,యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి అవినాష్ శెట్టి,జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఆధునిక జీవితంలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు యోగ సాధన చేయాలని కోరారు.

వర్సిటీ అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తా మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : రాయలసీమ విశ్వవిద్యాలయానికి ఎల్ల వేళలా సహకరిస్తానని రాష్ట్ర పరిశ్రమల మరియు వాణిజ్య శాఖ మంత్రులు టీజీ భరత్ అన్నారు. తన కార్యాలయంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్.టి.కే నాయక్, రిజిస్టర్ డాక్టర్ ఎన్ .వెంకటేశ్వర్లు నగరంలో కార్యాలయంలో కలిశారు. వర్శిటీకి సంబంధించిన సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కర్నూలు నగరపాలక సమస్య నుంచి మంచినీటి సరఫరా విషయం కూడా తమ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉద్యోగాల సౌకర్యాలు, హెల్త్ సెంటర్, ఏర్పాటుకు సహకరించాలని రెగ్యులర్,కాంట్రాక్టు ఉద్యోగాల జీతాలవిషయాన్ని పరిష్కరించాలని విన్నవించారు. అలాగే యూనివర్సిటీ ఆస్తుల పరిరక్షణ భాగంగా వర్సిటీ ప్రహరీ గోడను నిర్మించాలని వినతి పత్రంలో తెలియజేశారు. స్థానికులంగా స్పందించి పరిష్కరిస్తానీ హామీ ఇచ్చారు.

డిసెంబరులోగా సంజీవయ్య సాగర్ పనులు పూర్తి

విశాలాంధ్ర-గోనెగండ్ల: డిసెంబరు లోగా సంజీవయ్య సాగర్‌కు సంబంధించిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎంపి నాగరాజు ఆదేశించారు. సంజీవయ్య సాగర్ ప్రాజెక్టు పనుల గురించి డి. విజయ్ కుమార్,అలీ, ప్రాజెక్ట్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ లోగా ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలివ్వడం జరిగిందని తెలిపారు. ఎప్పటి కప్పుడు అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని జగన్ ప్రభుత్వంలోలేని అభివృద్ధి కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గోనెగండ్ల ఏపీ యూడబ్ల్యూజే గౌరవాధ్యక్షులు మధు ఇంటికెళ్లి వారి కుటుంబ సభ్యులను ఎంపి కలిశారు. మధు, ఎంపీని ఘనంగా సత్కరించి సన్మానించారు. ఏపీయూడబ్ల్యూజే తాలుకా ఉపాధ్యక్షులు ఖలీల్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఎంపి సందర్శించారు. నాయకులు, టీడీపీ జిల్లా మైనార్టీ ఆధికార ప్రతినిధి బడేసా, మాజీ ఎంపీపీ హనుమంతు, మాజీ సర్పంచ్ సంజన్న,గంజిహళ్లి క్రిష్ణమ్మ నాయుడు,మాజీ మండల ఉపాధ్యక్షులు బుడ్డప్ప, సాగునీటి సంఘం అధ్యక్షులు మాబు, పిల్లిగుండ్ల కృష్ణ, గాజులదిన్నె రామకృష్ణ,పిల్లిగుండ్ల జయరాముడు,ట్రాక్టర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డాక్టర్ మైత్రేయిపై చర్యలు తీసుకోవాలి-ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-ఎమ్మిగనూర్: ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తూ విధులకు దుమ్మా కొడుతూ తన సొంత ప్రైవేట్ క్లినిక్‌లకి పరిమితమై ప్రభుత్వ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ తన భర్త విధులకి రాకపోయినా హాజరు వేయించడం ప్రధానంగా అక్బర్ బేగం ప్రసవం కోసం పురిటి నొప్పులతో వెళ్లగా నిర్లక్ష్యంగా వ్యవహరించి నవజాత శిశువు మరణానికి కారణమైన డాక్టర్ కె.మైత్రేయిలి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో జిల్లా ఉన్నత వైద్య అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని ఏవైఐఎఫ్ ఆధ్వర్యంలో డిఎంఅండ్ హెచ్ఓ-డిసిహెచ్ఎం దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. అనంతరం ఏవైఐఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పాలకొమ్మ రాజీవ్ మాట్లాడుతూ ఇప్పటికైనా వైద్య అధికారుల విచారణ పూర్తి కాలేద లేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం అవుతుందన్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. డా. మైత్రేయినీ సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. యువజన నాయకులు ప్రతాప్, సందీప్, ఏసు రాజు, జెరూసలేం, ఇమానుయెల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం-ఎంపీ నాగరాజు

విశాలాంధ్ర-ఆదోని : కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజు అన్నారు. శనివారం ఆదోని మండలం ఆరేకల్ గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను అధికారులతో కలిసి సందర్శించారు. అంతకుముందు డి.ఎస్.పి సోమన్న, ఎమ్మార్వో శివ రాముడు, వైద్య సిబ్బంది సుపరిండెంట్ డా. శ్రీరాములు, ఆర్ఎంవో డా.జగదీస్, నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కూటమి తరపున ఆదోని నియోజకవర్గంలో సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చామన్నారు. అందులో భాగంగా గాజులదిన్నె ప్రాజెక్టు, ఎమ్మిగనూరులో బనవాసి నవోదయ స్కూల్, ఆదోని మెడికల్ కళాశాల సందర్శించడం జరిగిందని అన్నారు. మెడికల్ కళాశాల పన్నుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాలను సందర్శిస్తూ కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతమైనటువంటి ఆదోని ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలకు తాము ముందుంటామని, అవసరమైతే కేంద్రంతో మాట్లాడి ఆదోని ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు సయ్యద్ అప్సర్ బాష, బీసీ సాధికారత కమిటీ డైరెక్టర్ చాగి మల్లికార్జునరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, సర్పంచు దొడ్డనకేరి శివప్ప, మాజీ సర్పంచ్ హానవాళ్లు మహబూబ్‌బాష, మాజీ కౌన్సిలర్ వెంకన్నపేట మల్లికార్జున, ఆరెకల్ మాజీ సర్పంచు రామకృష్ణ, దిబ్బనకల్ సర్పంచు లక్ష్మన్న, విరుపాక్షిరెడ్డి, మధిర రంగస్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

29 నుండి ఇసుక అందుబాటులోకి-జాయింట్ కలెక్టర్ నవ్య

విశాలాంధ్ర-సి.బెళగల్: ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గురువారం నుండి ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని సచివాలయంలో ఇసుక బుకింగ్ ప్రక్రియను ఆమె పరిశీలించి అనంతరం అధికారులతో కలిసి మండల పరిధిలోని తుంగభద్రనది తీర గ్రామాలైన ఈర్లదిన్నె, సింగవరం ఇసుకరీచుల ను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోమవారం నుండి నది నుండి ఇసుకను బయటికి తీసుకురావడానికి ప్రక్రియ మొదలు పెట్టాలని..గురువారం నుండి ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తేవాలని ఆమె అధికారులకు సూచించారు. ఇసుక రీచుల వద్ద తోడిసిన ఇసుక ఖర్చులతో కలిపి టన్ను రూ.326.50 ప్రజలకు అందివ్వనున్నట్లు తెలిపారు. ఇసుక పాలసీ విధానం అనుసరించి ప్రస్తుతం సచివాలయాలలో మాన్యువల్ గా చెల్లించి తగులు నిబంధనలు పాటించాలన్నారు. సెప్టెంబరు 11 నుండి ఇసుక ఆన్లైన్ పద్ధతిలో అందివ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆమె వెంట మైనింగ్ అధికారి రాజశేఖర్, తహసిల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో ఏసీ రాముడు, ఈఓ ఆర్‌డి సందీప్, సబ్ అధికారి రామాంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు జాకీర్, శ్రీనివాసులు ఉన్నారు.

గుడికంబాలి ఇసుక రీచ్ తనిఖీ

కౌతాళం: మండలం లోని గుడి కంబాలి ఇసుకరీష్ ను, స్టాక్ యాడును జిల్లా జాయింట్ కలెక్టర్ బి. నవ్య తనిఖీ చేసి పరిశీలించారు. శనివారం గుడికంబాలి ఇసుక రీచ్ వద్ద ఉన్న స్టాప్ వివరాలు, తుంగభద్ర నది నుండి లభిస్తున్న ఇసుక వివరాలను రెవెన్యూ అధికారులకు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సి.విశ్వనాథ(ఇంచార్జ్), మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఆర్ఐ రాజశేఖర్ ఉన్నారు.

అరికెర గురుకులంలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలి

డీసీవో శ్రీదేవికి వినతిపత్రం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులు

విశాలాంధ్ర-ఆలూరు: అరికెర అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సైన్సు గ్రూప్‌లను ప్రవేశ పెట్టాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు డీసీవో శ్రీదేవికి వినతిపత్రం అందించారు. శనివారం అరికెర గురుకుల పాఠశాలలో సైన్సు గ్రూప్‌ల ప్రవేశ పెట్టేందుకు తల్లిదండ్రుల కమిటీతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభిప్రాయం కోరారు. వారు ఆర్ట్స్ గ్రూప్ తోపాటు సైన్సు గ్రూప్ లను ప్రవేశ పెట్టాలని కోరారు. వచ్చే ఏడాది వరకు ఆర్ట్స్ గ్రూపులు కొనసాగిస్తూ సైన్సు గ్రూప్ లను కూడా అందించాలని కోరారు. పాఠశాల ముందు విరుపాపురం స్టోరేజ్ ట్యాంక్ నుండి పక్క గ్రామాలకు నీరందిస్తున్నారని పైపులైన్ నుండి మంచినీటిని పాఠశాలకు అందించాలని బిసి సంఘం నాయకులు తిక్కస్వామి కోరారు. జిల్లా కలెక్టర్ కు సమస్యను విన్నవిస్తామని తెలిపారు. గురుకులంలో ప్రస్తుతమున్న గ్రూప్‌లలో విద్యార్థుల ఉన్న సీట్లలో సగం కంటే తక్కువగా చేరినందున కేవలం ఆరుగురు ఎం.ఇ.సి గ్రూపులో చేరడంతో ఆర్ట్స్ గ్రూప్ స్థానంలో సైన్స్ గ్రూప్ అందిస్తామని డీసీవో తెలపగా, ఉన్న గ్రూప్‌లను కొనసాగిస్తూనే విద్యార్థులు చేరేలా అవగాహన కల్పించడం, సైన్సు గ్రూప్‌లను ప్రవేశ పెట్టాలన్నారు. ఇటీవల బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను కూడా తుగ్గలికి తరలిస్తున్నారని ఇలా ఉన్న పాఠశాలను తరలించకుండా టెక్నికల్ కోర్సులు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. అందరి సమస్యలు విన్న డిసిఓ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

27న కర్నూలు నగరంలో దీక్షలు-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-దేవనకొండ: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సం క్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలకు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలకు పొట్టకూటి కోసం తల్లిదండ్రులు వలసల వెళ్లే సందర్భంలో వసతితో పాటు, సమయానికి నాణ్యమైన భోజనం-వసతి భావించి, వారి పిల్లలను సంక్షేమ వసతిగృహాల్లో చేర్పించి వెళ్తున్నారన్నారు. ఆ సమయంలో వారికి సమస్యలతో వసతిగృహాలు స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేవనకొండ తదితర మండలాల్లో వసతి గృహాల నిర్వహణ లోపంతో మూసివేయడం జరిగిందన్నారు. ఆస్పరి.. ఇతర మండలాల్లోని వసతి గృహాలకురెగ్యులర్ వార్డెన్‌లేక పై తరగతుల విద్యార్థులే వార్డెన్ బాధ్యతలను నిర్వహించి, వసతి గృహాన్ని నడుపు తున్నారన్నారు. వసతి గృహాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయడంలో అధికారులు ఘోరంగా విఫలం చెందారనీ విమర్శించారు. దేవనకొండలో మూసివేసిన బీసీ బాలుర గృహాన్ని ప్రారంభించాలని, ఖాళీపోస్టుల భర్తీ, పెండింగ్ మెస్ కాస్మోటిక్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ఈనెల 27న కర్నూలు నగరంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని, ఈ దీక్షలకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈసమావేశంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు మనోజ్, భరత్, జావిద్, అరవింద్‌లు పాల్గొన్నారు.

కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్‌లు డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 3 నెలలు పూర్తికావస్తున్న ఒకేషనల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. కళాశాలలో లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జూనియర్ కళాశాల ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ అధ్యక్షులుగా విజయ్, ఉపాధ్యక్షులుగా వివేక్, మహేష్, సాయి కుమార్, గౌస్ కార్యదర్శిగా కేశవ్, సహాయ కార్యదర్శులుగా హర్షిత్, గణేష్, రంజిత్‌రెడ్డి, ఫిరోజ్, కోశాధికారిగా సుధాకర్‌తో పాటు 25 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ, పట్టణ అధ్యక్షులు వినోద్, నాయకులు మా భాష, చరణ్, హరి, రవి, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక వంతెన పూర్తి చేయాలి..ఆర్డీవో రామలక్ష్మి

విశాలాంధ్ర-ఆలూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా హొలహర్వి మండలం చింతకుంట సమీపంలోని వంతెన తెగిపోయింది. విషయం తెలుసుకున్న ఆర్డీవో రామలక్ష్మి శనివారం వంతెను పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈరహదారి జాతీయ రహదారి కావడంతోఆంధ్ర-కర్ణాటకలకు రాకపోకలు సాగించాలంటే వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నార న్నారు. రైతులు పంటపొలాలకు వెళ్లడానికి కూడా దారి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈరహదారిలో రోజు వేలాదిగా వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ అంశాలన్నింటిని దృష్టిలో ఉంచుకొని యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక వంతెన పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకొని రావాలని జాతీయ రహదారి అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట రెవిన్యూ అధికారులు తాహసీల్దార్ నజ్మా భాను, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, రెవిన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు, జాతీయ రహదారి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు

విశాలాంధ్ర-పత్తికొండ: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. దూదేకొండ సీపీఐ ఎంపీటీసీ పెద్ద ఈరన్న మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువ కిందున్న ఎడమ కాలువ పనులు పూర్తి చేసినట్లయితే 10వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయడంలో ఇరిగేషన్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. జలజీవన్ మిషన్ కింద దూదేకొండలో ఇంటింటికి కులాయిలు వేసే పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీలు చక్రాళ్ళ రాజు, పుచ్చకాయలమాడ చంద్రలుమాట్లాడుతూ ప్రభుత్వం మారి మూడు నెలలు పూర్తికావస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటో సమావేశం భవనంలో ఎందుకు పెట్టలేదని ఎంపీపీని నిలదీశారు. పెద్దహుల్తి సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతుల పంటపొలాలు పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు పంటపొలాల పరిశీలనకు రాలేదని, నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడి సెంటర్‌కు సొంత భవనం కేటాయించాలని పలుమార్లు అడిగినా పట్టించుకోవడం లేదన్నారు.

వర్షం కోసం.. వరణ యాగం..

విశాలాంధ్ర-ఆస్పరి : తొగలగల్లు గ్రామంలో రైతులు శనివారం వర్షం కోసం స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో వరుణ యాగం చేపట్టారు. ముందుగా దేవాలయంలో వేద పండితులు ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి తిరువాం జయ, పర్జన్య యాగం, రుద్ర హెూమము, నవగ్రహ హెూమము, శాంతి పౌష్టిక హెూమము, బలిహరణము, పూర్ణాహుతి, రూత్విక్ సన్మానము, మహా మంగళహారతి టైగర్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంజినయ్య, గ్రామపెద్దలు లక్ష్మన్న, జగన్నాథ్, సుదర్శనం, నాగేశ్వరరావులు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని, పంటలు పండించేందుకు పుష్కలంగా నీరు అందాలని మూడు రోజులుగా వరుణ యాగం చేస్తున్నామని తెలిపారు. వరుణ యాగం ముగింపు సందర్భంగా స్థానిక ఓబులేసు స్వామికి పరుపు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. వచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో హరికథ గానం, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన ట్యాబ్ బేస్డ్ అసెస్మెంట్

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన చేపట్టిన ట్యాబ్ బేస్డ్ అసెస్మెంట్ శనివారం ముగిసింది. కర్నూల్ జిల్లా కర్నూల్ రూరల్ మండలం నందు సోషల్ పరీక్ష జడ్.పి.హెచ్.ఎస్ గార్గేపురం మరియు కేజీబీవీ పంచలింగాలలో నిర్వహించారు. 100 శాతం పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. మరియు పరీక్ష ట్యాబుల్లోనే పూర్తి చేశారు. జడ్పీహెచ్ఎస్ గార్గేపురంలో హెచ్ఎం మరియు పాఠశాల సిబ్బంది, మండల విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్, మండల ఎంఐఎస్ సమన్వయకర్త చంద్రశేఖర్ రాజు, సిఆర్పి శివశంకర్ పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయ లోపంతో బాలికల భవిష్యత్తు నాశనం చేయకండి

విశాలాంధ్ర-చిప్పగిరి: కస్తూరి బా గాంధీ బాలికలపాఠశాలలో విధులు నిర్వర్తించే ప్రధాన ఉపాధ్యాయురాలు మరియు బోధన ఉపాధ్యాయురాలుసమన్వయ లోపంతో బాలికల భవిష్యత్తును నాశనం చేయకండని ఇన్చార్జి తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ హెచ్చరించారు. శనివారం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలపై పలువురు బాలికల తల్లి దండ్రులు విన్నపం మేరకు కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వంటతీరు, విద్యాబోధనపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌజన్యకు, తోటి ఉపాధ్యాయురాలుకు మరియు సిబ్బందికి సమన్వయం లేక ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారని తమ దృష్టికి వచ్చిందని వచ్చిందని మీరు ఇలాగే ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు తెలియ చేస్తామన్నారు. అడుగడుగున సమస్యలు ఉన్నాయని, బియ్యంలో పురుగులు ఉన్నా కూడా వంట చేస్తున్నారని మా దృష్టికి వచ్చిందన్నారు. మీ ఇంటిలో మీ పిల్లలకు ఇలాగే వండి వడ్డిస్తారు అంటూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఎక్కడ పరిశుభ్రత లేదని ఇలా ఉంటే బాలికలు ఎలా చదువుకుంటారని మండిపడ్డారు. బాలికలు చదువు కోవాలని వారి వారితల్లిదండ్రులను వదలుకొని ఎక్కడ నుంచో ఇక్కడ కు వచ్చి బాలికలు విద్యను అభ్యసిస్తున్నారని, వీరి కోసం ప్రభుత్వం అన్ని వసతులు కల్పించాలని ఉద్దేశంతో అన్ని వసతులు కల్పిస్తున్న మీరు మాత్రం బాలికల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మీ పద్ధతులు మార్చుకోకపోతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి నోటీసులు ఇచ్చి ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ స్వామి, చిప్పగిరి రెవెన్యూ కార్యదర్శి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ శాఖలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : గృహనిర్మాణ శాఖలో గత 19 సం నుండి ఔట్సోర్సింగ్ , టైంస్కేల్ వర్కర్‌ను ప్రభుత్వం క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని గృహ నిర్మాణసంస్థ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వామనగిరి హనుమన్న కోరారు. శనివారం ఆయన పాత్రికేయు లతో మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణసంస్థలో 19 ఏళ్లుగా ఔట్సోర్సింగ్ మరియు అప్రెంటిస్ ట్రైనింగ్ పూర్తి చేసి వర్క్ ఇన్స్పెక్టర్లు విధానంలో ఉద్యోగులు, వర్క్ ఇన్స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐసీలు, అటెండర్లు ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రంలో దాదాపు 2500 మంది గృహ నిర్మాణ సంస్థ లో పనిచేస్తున్నారన్నారు. హౌసింగ్ లో పనిచేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ వర్కర్లు క్రమబద్ధించకరించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ మాట్లాడుతూ,హౌసింగ్ లో రెగ్యులర్ ఉద్యోగులు దాదాపు 90% రిటైర్ అయ్యారు, పోస్టులన్నీ కూడా ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీ పోస్టులకు రెగ్యులర్ ద్వారా తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. 19 సంవత్సరాల నుంచి చాలీచాలని జీతాలతో సంస్థలో బండెడు భారాన్ని మోస్తూ గృహ నిర్మాణాల పురోగతికి పాటుపడుతున్నామని తెలిపారు. ఉద్యోగులకు శ్రమకు తగిన ఫలితం గుర్తింపు రావడం లేదన్నారు. గ్రౌండ్ వర్క్ నుంచి ఔట్సోర్సింగ్ ఉద్యోగులే కీలకమైన పాత్ర వహించి పనిచేయవలసింది ఉంటుంది. ఎప్పటికైనా రెగ్యులర్ అవుతాయన్న నమ్మకంతో పని భారాన్ని మోస్తూ ఉన్నామన్నారు. గత ప్రభుత్వంలో మాతో బండేడు పని భారం చేపించి మాకు రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి మాకు ఎటువంటి న్యాయం చేయక మా కుటుంబాలకు అన్యాయం చేసిందన్నారు. . ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మా ఔట్సోర్సింగ్ ఉద్యోగులను న్యాయం చేయాలన్నారు. మా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ప్రతి పనిలో కీలకమైన పాత్ర పోషిస్తున్నాము. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) వంటి కేంద్ర పథకం అమలు చేయటంతో పాటు, రాష్ట్ర భాగస్వామ్యంతో పథకాలను అవుట్సోర్సింగ్ ఉద్యోగులే ముందుకు తీసుకుపోతున్నామన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలను గ్రౌండ్ చేయటం క్షేత్రస్థాయిలో పురోగతి ఉండేలా అనేక సాంకేతిక అంశాలను ఔట్సోర్సింగ్ ఉద్యోగులే పని చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మా గోడు విన్నవించలేదు కావున ఇప్పటికైనా మా శ్రమను గుర్తించి మాకు టైం స్కేల్ గాని ఎన్ఎంఆర్లుగా ప్రకటించాలని కోటి ఆశలతో కూటమి ప్రభుత్వానికి కోరుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం కార్యదర్శులు లక్ష్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీగానే మిగిలిపోతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు

విశాలాంధ్ర-కోడుమూరు : కోడుమూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీ కేవలం ఎన్నికల హామీగానే మిగిలిపోతుందని ఏఐఎస్ఎఫ్-ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు రంగస్వామి,శ్రీరాములు గౌడ్ లు ఆరోపించారు.శనివారం పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్-ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు రంగస్వామి, శ్రీరాములు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలు చెబుతున్నా, జిల్లాలోని కోడుమూరు నియోజకవర్గానికి మాత్రం ఆ నిబంధన వర్తించడం లేదన్నారు.ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని నియోజకవర్గ ప్రజలకు,విద్యార్థులకు,మేధావులకు చెప్పి వారితో ఓట్లు వేయించుకొని గెలిచినా తర్వాత హామీని మరచిపోతున్నారని పేర్కొన్నారు.నియోజకవర్గం పేరుకేమో ఢిల్లీ స్థాయిలో సైతం నాయకులను అందించిన పేరుందని,విద్యాసంస్థలు ఏర్పాటులో మాత్రం అన్ని నియోజకవర్గాల కంటే వెనుకంజలో ఉందన్నారు.అనేకమంది రాజకీయ నాయకులు ఉన్నా కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు మాత్రం ఎవరు పట్టించుకోరని,వారికీ ఆదాయం వచ్చే పనులను మాత్రం వెంటపడి మంజూరు చేసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి విద్యారంగా అభివృద్ధికి పూనుకొని డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరరు.లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు కనువిప్పు కలిగే విధంగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చూడతామని హెచ్చరిస్తున్నాము.ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు వీరంజినేయులు, అల్తాఫ్, మహమ్మద్ అజామ్, పులి, ఏఐవైఎఫ్ నాయకులు విశ్వనాథ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో..

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని లయన్స్ జిల్లా చైర్మన్ డా.రాయపాటి శ్రీనివాస్ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చిన్నారులు రాధాకృష్ణ గోపికల వేషధారణతో అభినయం చేశారు. ఈ సందర్భంగా రాయపాటిమాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ముస్లిం చిన్నారులు కూడా రాధాకృష్ణుల వేషధారణతో అభినయం.సంస్కృతి సాంప్రదాయాలను భిన్నత్వంలో ఏకత్వానికి అద్దం పడుతుందన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించే బాధ్యత మనందరిపై ఉందని ఎంఈవో వీర ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యాశాఖపై తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమా మహేశ్వరరావులతో కలిసి ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదవ తరగతి ఇంటర్మీడియట్ చదువుకోవాల్సిన విద్యార్థులు బయట ఉంటే ఓపెన్ స్కూల్లో చేర్పించాలన్నారు. పాఠశాలలో బాత్రూంలు, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతతో కూడిన భోజనం అందించేలా చూడాలని, పాఠశాలతో పాటు పాఠశాల పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత సచివాలయం ఉద్యోగులపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

సంజీవనగర్ తండాలో పొలంబడి

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్: మండలంలోని సంజీవ్‌నగర్ తండా గ్రామంలో వరి పంటలో ఐఎన్‌డిఐ - జీపీపి పొలం బడి కార్యక్రమం లోభాగంగా వరిలో నిర్వహించారు. అందులో మండల వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి, ఏఈఓ లతమ్మ, వి ఏ ఏ మధు, రైతులు పాల్గొని అందులో వరి నారు కట్టలను సుడోమోనాస్ ద్రావణంలో 30 నిమిషాలు ఉంచి తర్వాత నాటుకోవడం వల్ల తెగుళ్ళలను నివారించవచ్చు.. నాటేటప్పుడు ఆకు కొనలను త్రుంచి నాటుకోవడంతో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగును నివారించవచ్చు. ప్రతీ రెండు మీటర్లకు తూర్పు - పడమర కాలి బాటలు ఏర్పాటు చేసుకోవడం వలన గాలి వెలుతురు బాగా తగిలి దోమ పోటు భారి నుండి పంటను కాపాడుకోవచ్చు అని పొలం బడి కార్యక్రమం చేపట్టారు.

మొక్కలు పెంచుదాం.. పర్యావరణం కాపాడుకుందాం

విశాలాంధ్ర-కర్నూల్ ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి.కబర్ధి..జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో జిల్లా సేవాధికార సంస్థ ఆవరణ మరియు జిల్లా కోర్ట్ ఆవరణం నందు స్పార్టన్స్ సొసైటీ వారి సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటడంతో కాలుష్యం రాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, జిల్లా అధ్యక్షులు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బివిఎస్. రవికాంత్ ప్రసాద్, న్యాయవాదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి పీరు సాహెబ్ పేట ఉప సర్పంచ్

విశాలాంధ్ర-మిడుతూరు : నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని పట్టణ ,గ్రామీణ ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు రోజురోజుకు వైసీపీ వీడి పార్టీలో చేరుతున్నారు. శనివారం పీరుసాహెబ్ పేటకు చెందిన గ్రామ ఉప సర్పంచ్ దండగల విష్ణు,వార్డు మెంబర్ దండగల గోపి ,దండగల రాజు, తదితరులు గ్రామ టిడిపి నాయకులు రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిత్త జయ సూర్య,నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో వైసీపీ పార్టీని వీడి టిడిపిలో చేరారు. ముందుగా వారికి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమని, బాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అదేవిధంగా గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను వారు కోరారు.

ఉర్దూ సమస్య పరిష్కరానికి కృషి చేస్తా

విశాలాంధ్ర-నంద్యాల: ఉర్దూ పాఠశాలల బలోపేతానికి, ఉర్దూ సమస్యలను పరిష్కరానికి తనవంతు కృషి చేస్తానని డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఉర్దూ రేంజ్, నంద్యాల షెక్ హస్మొద్దీన్ పేర్కొన్నారు. జొయ ఉర్దూ కోచింగ్ డైరెక్టర్ సి. అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన టెట్-2024 ఉచిత కోచింగ్ పొందుతున్న విద్యార్థులకు టెట్ పేపర్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నంద్యాల జిల్లా డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఉర్దూ రేంజ్ షెక్. హస్మొద్దీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో మంచి ఉపాధ్యాయులుగారావటం కొరకు ఏకాగ్రత, చిత్తశుద్ధితొ చదవాలని విద్యార్థులకు సూచించారు. జొయ ఉర్దూకోచింగ్ ఉర్దూ విద్యార్థులకు, ఉర్దూ భాషాభివృద్ధికి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ ఎక్స్పర్ట్ సి. అబ్దుల్ అజీజ్, సోషల్ సబ్జెక్టు ఎక్స్పర్ట్ అంజద్ షరీఫ్, జొయ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సి.అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జొయ ఉర్దూ కోచింగ్ డైరెక్టర్ అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో ఉర్దూ డి.ఐ హస్మొద్దీన్ ని ఘనంగా సన్మానించారు.

సిఐని కలిసిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్

విశాలాంధ్ర-నందవరం : ఎమ్మిగనూరు రూరల్ సీఐ విక్రమ సింహాను మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ దేశాయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సిఐను ఆయన కలిసి పుష్పగుచం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు ప్రశాంతతకు నిలయం ఎమ్మిగనూరు గ్రామాలు అని, అలాంటి గ్రామాల్లో గొడవలు, అసాంఘిక సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని, ప్రజలతో మమేకమై మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంతత కోసం పాటుపడే పోలీస్ శాఖకు టిడిపి నాయకులు ఎల్లప్పుడు సహాయాసహకారాలు అందిస్తారన్నారు. అలాగే నందవరం ఎస్సై వి. శ్రీనివాసులను పూలచింత టీడీపీ సీనియర్ నాయకులు షరీఫ్ పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతలు కాపాడాలని, అందుకు తమ వంతు సహాయం ఎల్లపుడు అందిస్తామని తెలిపారు.

శ్రీవారి పాదాలకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ రంగనాథ స్వామి వారి పాదాలు పెరవలి నుండి సుమారు మూడు కిలోమీటర్ల దూరం లో ఉన్న స్వామి వారి పాదాల దగ్గరకు శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా చిన్న పల్లకితో ఊరేగింపుగా వెళ్లి స్వామివారి పాదములకు అభిషేకం చేసిన అనంతరం దేవాలయానికి వస్తారని కావున గ్రామ ప్రజలు భక్తాదులందరూ స్వామివారి కార్యక్రమానికి హాజరు కావాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి, ప్రధాన అర్చకుడు, గ్రామ పెద్దలు తెలిపారు.

చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోండి.. జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిరుద్యోగ పేద యువతకు చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పండిస్తున్న టమోటా, ఉల్లి తదితర ఉత్పత్తుల మార్కెటింగ్, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలన్నారు.. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా యూనిట్ల స్థాపనకు రూ.10 లక్షల రుణం మంజూరు లో రూ. 3.50 లక్షల సబ్సిడీ ఉందన్నారు.. ఇలాంటి పథకాలను యువత వినియోగించుకునేలా అధికారులు తగిన సహకారం అందజేయాలన్నారు...ఈ పథకం ద్వారా ఆదోని,పత్తికొండ తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న టమోటా,ఉల్లి స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు....టమోటాను ఒక వారం రోజులు నిల్వ చేయగలిగితే, ఇక్కడి నుండి హైదరాబాద్ కు పంపిస్తే, రైతులకు లాభం కలుగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.. ఈ దిశగా ఆలోచన చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. 20 రోజుల్లోపు ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికతో తన వద్దకు రావాలని కలెక్టర్ మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఆర్డిఏ, హార్టికల్చర్, ఫిషరీస్ అధికారులను ఆదేశించారు.సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులను గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులను సంబంధిత అన్ని శాఖలతో పాటు భూమికి సంబంధించిన క్లియరెన్స్ కోసం రెవెన్యూ శాఖ కు కూడా పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా యూనిట్ల స్థాపనకు యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చేలా పథకం వివరాలతో పత్రికా ప్రకటన జారీ చేయాలని, అలాగే కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలని కలెక్టర్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు..అలాగే ఈ పథకం కింద రుణాల మంజూరుకు బ్యాంకులు తిరస్కరించిన దరఖాస్తులపై సమీక్ష చేయడానికి సంబంధిత శాఖల అధికారులు మరియు బ్యాంకర్లతో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు..ఏపీఐఐసీ సమస్యలకు సంబంధించి జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకుని పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కు సూచించారు...జిల్లాలో గుర్తించిన పరిశ్రమల్లో మరోసారి భద్రతను పరిశీలించి తనకు నివేదిక సమర్పించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, పరిశ్రమ శాఖ జిఎం మారుతీ ప్రసాద్, ఎపిఐఐసి జీఎం సోమశేఖర్ రెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ. నారాయణరెడ్డి, కాలుష్య నియంత్రణ అధికారి ముని ప్రసాద్, ఎల్డిఎం రామచంద్రరావు, మత్స్యశాఖ అధికారి శ్యామల, ఏపీఎంఐపి పిడి ఉమాదేవి, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదును వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-పెద్దకడబూరు: ఈ పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదోని వ్యవసాయ సహాయ సంచాలకులు అరుణ కుమారి వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరు లోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 15 లోపు ఈ పంట నమోదు మరియు రైతులతో ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. సహాయ గణాంక అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ సహాయకులు జాగ్రత్త వహించి పంటకోత ప్రయోగానికై ఎన్నికైన పొలాలు సందర్శించి ఫారం-1 సమర్పించా లన్నారు. దీంతో గ్రామ పంట దిగుబడి, మండల దిగుబడి, జిల్లా, రాష్ట్ర దిగుబడులు అంచనా వేయొచ్చని తద్వారా జాతీయ ఆదాయం అంచనా వేయొచ్చని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడండి .. ఎమ్మెల్యే దస్తగిరి

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : భవిష్యత్తురాల మనుగడ పర్యావరణ పరిరక్షణ మీదే ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడాలని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. శనివారం రాయలసీమ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్ ఎన్‌టి నాయక్ మార్గదర్శనంలో తల్లి పేరు మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన యూనివర్సిటీ జాతీయ సేవా పథక విభాగాన్ని ఆయన అభినందించారు. సుశీల మీనా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సరిగా సంరక్షించుకోవాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రర్ డా. ఎస్. వెంక టేశ్వర్లు, సైన్స్,ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సివి కృష్ణారెడ్డి, ఆచార్య ఎన్ నరసింహులు ఆయా విభాగాల ఆచార్యులు అధ్యాపకులు బోధన సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని శనివారం ప్రతిభ హై స్కూల్ నందు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు శ్రీకృష్ణుడు, రాధా, రుక్మిణి, సత్యభామ, .. గోపికల వేషధారణలో చిన్నారుల చేసిన నృత్యాలు, అల్లరి పనులు గోపికలను ఆటపట్టించే దృశ్యాలు . తల్లిదండ్రులను ఆకట్టుకునేలా చేశారు. అనంతరం గోపికల మధ్య కృష్ణుడు ఉట్టి కొట్టడం ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యతోపాటు చిన్నారులకు మన సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పిల్లల్లో ఉత్తేజాన్ని పెంపొందే విధంగా యాజమాన్యం ముందుకెళుతుందని తెలిపారు.

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరులో శనివారం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ హైస్కూల్‌లో కృష్ణాష్టమి ముందస్తుగా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు .శ్రీకృష్ణుని జన్మను పురస్కరించుకుని ఎంతో ఉత్సాహంతో మరియు భక్తితో వేడుకలు పాఠశాల ఆవరణలో ఉత్సాహంతో జరిగాయి. విద్యార్థులు మరియు సిబ్బంది శ్రేయస్సు కోసం ఆశీర్వాదాలు కోరుతూ, సాంప్రదాయ ప్రార్థనతో

ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పాఠశాల ఆవరణంలో పూలమాలలు, రంగోలీలు, సంప్రదాయ ముగ్గులతో అందంగా ముస్తాబు చేసి పండుగ వాతావరణం నెలకొల్పారు. చిన్నారులు ఉట్టి కొట్టడం,విద్యార్థులు ఉత్సాహంగా మట్టి కుండను వగలగొట్టడానికి మానవ పిరమిడ్‌లను రూపొందించారు, ఇది కృష్ణుడి ఆట మరియు కొంటె స్వభావానికి ప్రతీక.

నంద్యాల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్‌లో వైభవంగా నిర్వహించారు. శనివారం ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ముఖ్య అతిథిగా డైరెక్టర్ డా. జే మురళీనాథ్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు తమ నృత్యాలతో ఎంతగానో ఆకట్టుకున్నారు. అలాగే తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా నృత్యాలతో అలరించిఉట్టికొట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సంజీవనగర్‌లోనూ.. శ్రీసంకల్ప్ ఒలింపియాడ్ పాఠశాలలోనూ శ్రీకృష్ణాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. ఈవేడుకలకు శాంతి నికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికలు వేషధారణలతో అందరినీ అబ్బురపరిచారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ హిందువులు జరుపుకునే పండుగలలో శ్రీకృష్ణాష్టమి ప్రముఖమైనదని, నవనీత చోరుడు, గోపికా వల్లభుడైన శ్రీకృష్ణుని బాల్యం, అల్లరి చేష్టలు, దుష్ట శిక్షణ శిష్టరక్షణార్థం శ్రీకృష్ణుడు చేసిన అనేక సాహసాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఉట్టి కొట్టే విధానం ఆకట్టుకుంది.

ఆస్పరి : మండల కేంద్రంలోని స్థానిక నారాయణ ప్రైమ్ స్కూల్ లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణతో చిన్నారులు ఆలరించారు. పాఠశాలలో నృత్యం,ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్‌ఆచారి మాట్లాడుతూ కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినం ఇదని.. దుష్టశిక్షణ.. శిష్ట రక్షణ... అన్న గీతోపదేశంతో మానవాళికి దిశనిర్దేశం కృష్ణభగవానుడు చేశారన్నారు. మహా భాగవతం కథలను విన్నా... దృశ్యాలను తిలకించినా జీవితానికి సరిపడా విలువలెన్నో బోధపడతాయి. ఆకావ్యం ఇప్పటి పరిస్థితులకు ఒక మార్గదర్శకంగా ఉండటం కృష్ణుడి మహోన్నత వ్యక్తిత్వానికి, ఆయన లీలలకు అద్దం పడుతోందని తెలిపారు. ద్వాపర యుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారని, పాఠశాల తరపున అందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్య క్రమంలో డైరెక్టర్ దీప్తి, అకాడమిక్ డీన్ సతీష్ కుమార్, ఉపాధ్యాయులు లావణ్య, చంద్రకళ, అంజనమ్మ, సౌమ్య, సమీరా, సంధ్య, పద్మావతి, నారాయణ లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక కృష్ణ నగర్ లోని సర్వేపల్లి విద్యా సంస్థల యందు కృష్ణాష్టమి శనివారం ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలకు పాఠశాల అధినేత పి .శేషన్న ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉట్టికొట్టి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి శ్రీకృష్ణుడు మానవుడే పుట్టి మాధవుడిగా వెళుతుంది. జగదుర్గవుగా భగవద్గీతను బోధించి ధర్మా రక్షణ చేశాడు. విద్యార్థులు అందరూ మంచి మార్గంలో నడిచి ధర్మస్థాపన కోసం పాటుపడాలని వారు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అందరూ శ్రీకృష్ణుని ,గోపికల వేషాల లో అందర్నీ ఎంతోగానో అలరించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు అందర్నీ ఎంతోగా ఆకట్టుకునే విధంగా చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలోకృష్ణాష్టమి వేడుకలు